క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



మాచర్ల: ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించటం ఎంతో సురక్షితమని మాచర్ల డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య అన్నారు. ఆదివారం మాచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో డాక్టర్ దశరధ్‌నాయక్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. డిపో పరిధిలోని పట్లవీడు, మరసపెంట, కొత్తపుల్లారెడ్డిగూడెం, వి.పి.సౌత్ రూట్లలో తిరిగే ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా ఆదివారం డాక్టర్ దశరధ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. బహుమతులు పొందిన వారిలో యర్రబాలెంకు చెందిన నరసింహారావు, కండ్లకుంటకు చెందిన మల్లేశ్వరరావు, వి.పి.సౌత్‌కు చెందిన ఆరికట్ల బ్రహ్మారెడ్డి, మరసపెంటకు చెందిన అంజిరెడ్డిలు ఉన్నారు.

మొసలి ఉన్నది.. జాగ్రత్త..



గురజాల : నగర పంచాయతీలోని లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద గల హద్దులకుంట వద్ద మొసలి సంచరిస్తున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న నగర పంచాయతీ, ఫారెస్టు అధికారులు ఆ ప్రాంతంలో నాలుగు వైపులా మొసలి సంచరిస్తుంది జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హద్దులకుంటను డైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ బి.మోహన్ శ్రీనివాస్‌లు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



దాచేపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. మండలంలోని గామాలపాడుకి చెందిన సంకుల నరసింహారావు, లంకెమళ్ల అచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. నరసింహారావుకి రూ.65 వేలు, అచ్చమ్మకి రూ.1.10 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను లబ్ధిదారులకు సర్పంచ్ జంగా సురేష్, జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్యలు అందజేశారు.

ఎగుడు దిగుడు రోడ్డుకు చెక్



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సొంత నిధులతో పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం సమీపంలో ఉన్న ఎగుడు దిగుడు రోడ్డులో గ్రావెల్ రోడ్డు ఆదివారం వేయించారు. గంగమ్మ తల్లి పక్క వీధిలో వేసిన సీసీ రోడ్డు ప్రధాన రహదారికంటే ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఆ రోడ్డులో వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లటంతో ఎమ్మెల్యే సొంత నిధులతో ఎగుడు దిగుడుగా ఉన్న రోడ్డులో గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేయించారు. వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండటంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నేర ప్రవృత్తిని విడనాడండి



దుర్గి: క్షణికావేశంలో జరిగిన నేరాలు మూలంగా తమ అమూల్యమైన జీవితాలను పాడుచేసుకోవద్దని ఎస్ఐ ఎం.శివ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులను స్థానిక పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులను గుర్తించి వివాదాలకు, అసాంఘిక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. తమ పద్ధతులను మార్చుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌన్సెలింగ్ నిర్వహణకు రెంటచింతల ఎస్ఐ శామ్యూల్ రాజన్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తొలగిన సర్వీస్ రోడ్డు కష్టాలు



తోపుడు బండ్లు తొలగించటంతో విశాలంగా ఉన్న సర్వీస్ రోడ్డు



చిరువ్యాపారుల కోసం నిర్మించిన తారురోడ్డు, ప్లాట్ ఫాం

- సర్వీస్‌రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు తొలగింపు
- చిరువ్యాపారుల కోసం రూ.30 లక్షలతో ప్లాట్‌ఫారాలు తారురోడ్డు నిర్మాణం
- చిరువ్యాపారులకు నష్టం జరగకుండా ఎమ్మెల్యే కాసు చర్యలు

దాచేపల్లి : ప్రజలు, వాహనదారులకు సర్వీస్ రోడ్డు కష్టాలు తీరాయి. దాచేపల్లి కొట్ల బజార్‌లోకి వెళ్లే సర్వీస్ రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టుకుని కొంతమంది చిరువ్యాపారాలు చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీ అధికారులు చిరువ్యాపారుల కోసం రూ.30 లక్షలతో తారురోడ్డు, ప్లాట్‌ఫాం నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. మరో రూ.35 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. సర్వీస్ రోడ్డుపై పెట్టిన తోపుడుబండ్లను తొలగించటంతో రోడ్డు విశాలంగా కన్పిస్తుంది.

చిరువ్యాపారుల సహకారంతో తోపుడు బండ్లు తొలగింపు..

దాచేపల్లిలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా కొట్లబజార్‌లోకి వెళ్లటంతో పాటు ఐదు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సర్వీస్ రోడ్డుపై పూలు, పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారు. కనీసం అంబులెన్స్‌కి కూడా దారి దొరకని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో చిరువ్యాపారులతో పలుమార్లు అధికారులు సమావేశమై సర్వీస్ రోడ్డుపై ఉన్న తోపుడుబండ్లను తొలగించారు.

నష్ట నివారణ చర్యలు భేష్..

సర్వీస్ రోడ్డుపై తోపుడుబండ్లను తొలగించే అంశాన్ని చిరువ్యాపారులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నగర పంచాయతీ అధికారులు, చిరువ్యాపారులతో ఆయన మాట్లాడి ఎట్టి పరిస్థితుల్లో వారికి నష్టం జరగకుండా చూడాలని, ఎంత ఖర్చయిన వెనకాడవద్దని అధికారులకు సూచించారు. సర్వీస్ రోడ్డులో తోపుడుబండ్లు తొలగిస్తే అభ్యంతరం లేదని, ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని చిరువ్యాపారులు కోరారు. దీంతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నాగులేరు ఒడ్డున ప్లాట్‌ఫాంతో సహా తారురోడ్డు నిర్మించారు. సర్వీస్ రోడ్డులో తోపుడుబండ్లు ఉన్న 70 మందికి ఇక్కడ ప్లాట్స్ కేటాయించారు.

ప్రజలకు మేలు జరిగింది..



సర్వీస్ రోడ్డులో తోపుడుబండ్లను తొలగించటం వలన ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంది. సర్వీస్ రోడ్డుపై తోపుడు బండ్లు ఉండటం వలన రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడుతున్నాం. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి ఇక్కడ తొలగించటం వలన ఎవరికి ఇబ్బందిలేదు. సర్వీస్ రోడ్డులో తోపుడుబండ్లు తొలగించటం కొంత మందికి ఇబ్బంది ఉన్నా.. ప్రజలకు మేలు జరిగింది.

లక్ష్మీనారాయణ, కూరగాయల వ్యాపారి

ప్రత్యామ్నాయం చూపించటం బాగుంది..



సర్వీస్ రోడ్డులో చిరు వ్యాపారుల తోపుడు బండ్లను తొలగించి నాగులేరు ఒడ్డున వీరికి స్థలం చూపించటం బాగుంది. వ్యాపారం సాగటానికి కొంత సమయం తీసుకున్న ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంది. చిరువ్యాపారులు కూడా అర్థం చేసుకుని అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉంది.

గుండా రమేష్, స్థానిక వ్యాపారి

ఎమ్మెల్యే కాసు కృషి అభినందనీయం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో దాచేపల్లికి ప్రమాదకరంగా ఉన్న కాటేరు వాగును బాగుచేయమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కోరితే తక్షణమే చేయించి వరద ముప్పు నుంచి కాపాడారు. చిరువ్యాపారుల పట్ల ఎమ్మెల్యే కాసుకి ప్రత్యేక అభిమానం ఉండటం వలనే రూ.30 లక్షలతో తారురోడ్డు నిర్మించి ప్లాట్‌ఫాం కట్టించారు. ఎవరికి నష్టం జరగకుండా ఆయన తీసుకున్న చర్యలు అభినందనీయం.

తాడేపల్లి మల్లిఖార్జునరావు, స్థానిక వ్యాపారి

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ సీఐ శరత్‌బాబు

మాచర్ల: రాష్ట్రంలో రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్ని రంగాలలో ఆర్థికంగా, సామాజికంగా, విద్యా పరంగా అభివృద్ధి చెందాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు పాల్ యేసు, అర్బన్ సీఐ పి.శరత్‌బాబులు అన్నారు. ఆదివారం శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద అనాథ ఆశ్రమంలో నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వెనుకబడిన దళిత వర్గాలకు సంబంధించి ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కుల పట్ల అవగాహన కల్పించి ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. నిజమైన ఎస్సీ, ఎస్టీ, కేసులను సత్వరమే పరిష్కరించేలా మానిటరింగ్ కమిటీ పనిచేయాలని వారు కోరారు. అదే విధంగా డ్రాపవుట్ అయిన విద్యార్థులను చైతన్యపరచి విద్య యొక్క ఆవశ్యకతను వివరించాలని అన్నారు. గురజాల ఏఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి, మానిటరింగ్ కమిటీ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి, గాదె కిరీటి రెడ్డి, బాబు, చిలకా వెంకటరత్నంతో పాటు పిడుగురాళ్ళ మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, బొంగురుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన



మాచర్ల పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని జయలక్ష్మీ పిక్చర్ ప్యాలెస్ సినిమా హాల్ నందు ఆదివారం తెలుగు సేన ఆధ్వర్యంలో నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన నిర్వహించారు. సినిమా హీరో సత్యారెడ్డి, గంగమహల్ సుబ్బారావులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిర్వహించే ఉద్యమంలో భాగంగానే ఈ సినిమా నిర్మాణం జరిగిందని తెలియజేశారు. ప్రజాగాయకుడు గద్దర్ నటించిన ఆఖరి చిత్రం ఈ ఉక్కు సత్యాగ్రహం సినిమా అని తెలియజేశారు. పల్నాడు ప్రాంతంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ సినిమాకు సంబంధించిన బస్సు ప్రదర్శన ఏర్పాటు చేయబడిందని వారు తెలియజేశారు.

ఉక్కు సత్యాగ్రహం ప్రచార కార్యక్రమం

మాచర్ల: పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గానికి చెందిన దర్శక నిర్మాత పులుసు సత్యనారాయణ, స్వర్గీయ గద్దర్ నటించిన విశాఖ ఉక్కు ఆంధ్రా హక్కులో భాగంగా రెండవ విడత మాచర్ల పట్టణంలో ప్రచార యాత్ర ఆదివారం చేపట్టారు. సత్యారెడ్డి అభిమానులు సత్యాగ్రహంతో కూడిన టీషర్టులు, జెండాలు పట్టుకొని ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలంతా ప్రచార యాత్రను ఆసక్తిగా గమనించి స్వర్గీయ గద్దర్‌కు జే జేలు పలుకుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

దళిత వాడలలో విద్యపై అవగాహన



కార్యక్రమంలో దుర్గి సర్పంచి రాయపాటి మాణిక్యం, విద్యార్థులు

దుర్గి: బాలబాటల ద్వారా దళితవాడలలో విద్యాచైతన్యం తీసుకురావడం మంచి ఆలోచన అని దుర్గి మండల విద్యుత్ ఏఈ రాంబాబు అన్నారు. ఆదివారం ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్డ్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ విశ్వనాథం నిర్వహణలో రాష్ట్రంలో 7వేలకు పైగా బాలబాట కార్యక్రమాల ద్వారా రెండున్నర లక్షల మందికి ఉచిత విద్య అందిస్తున్నారన్నారు. కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్ళూరి అమర్‌నాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనటం సంతోషకరమన్నారు. దుర్గి సర్పంచి రాయపాటి మాణిక్యం మాట్లాడుతూ పేదల కోసం కార్డ్స్ సంస్థ, విద్యాభివృద్ధికి కృషిచేయటం అభినందనీయమన్నారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ దళిత గిరిజన విద్యా చైతన్యానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. పేరుపోగు ప్రసాద్, ఏసీవో కుక్కమూడి ప్రమీల, పాస్టర్ కుక్కమూడి ప్రదీప్‌కుమార్, సీహెచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతల కలశం శోభాయాత్ర



అచ్చంపేటలో అయోధ్య రామ మందిర అక్షింతల గ్రామోత్సవం

అచ్చంపేట(పెదకూరపాడు) : అయోధ్యలో రామ మందిరం జనవరి 22వ తేదీన ప్రారంభం సందర్భంగా దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు చేరాలన్న సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన అక్షింతల కలశంకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో అంక్షితలకు స్వాగతం పలికారు. స్థానిక రామాలయం నుంచి అయోధ్య బాలరాముని పవిత్ర అక్షింతల కలశాన్ని గ్రామ వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల ప్రఖండ జలసూత్రపు తిరుపతి స్వామి పర్యవేక్షణలో, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తమ్మా వెంగళరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామానికి చెందిన వేంకట కోటిలింగం, నీలకంఠేశ్వరరావు, సత్యనారాయణ, ఆంజనేయులు, బీజేపీ మండల కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, బీజేపీ అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మాచారి బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అణుపకళ, చంద్రావతి, ఉషారాణి, భక్తులు, మండల కమిటీ సభ్యులు పాల్గొని శోభాయాత్రని విజయవంతం చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విజయపురిసౌత్: ప్రేమకు, శాంతికి, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ వేడుకలని రెవరెండ్ డాక్టర్ దానియేలు శ్యాంబాబు అన్నారు. ఆదరణ మానవ సేవా సహాయ సమితి కార్యదర్శి పలుకూరి జోసఫ్‌బాబే ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లోని ది లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళిని బిడ్డలుగా స్వీకరించి ఆదరించి ప్రేమించిన క్రీస్తు యావత్ జగత్‌కు జ్యోతిగా నిలిచారని తెలిపారు. క్రీస్తు జన్మదినం లోకానికి దివ్య సందేశం అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ రఘు, సంఘ పెద్దలు జక్కి జయరావు, కె.కోటేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, ప్రహ్లాద, వీరారెడ్డి, చార్లెస్‌స్కాట్ పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు శ్రవణానక్షత్రం పురస్కరించుకొని పుష్పయాగం నిర్వహించారు. కల్యాణ నిర్వహణ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, సభ్యులు కొత్తమాసు బ్రహ్మారావు, కజ్జం గురవయ్య, సూరే యలమంద, భవనాసి రామ్మూర్తి, గౌరు సుబ్బారావు, తొండపు శ్రీనివాసరావు, పోలిశెట్టి లింగేశ్వరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు జరిపారు. పుష్పయాగం అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వీరాంజనేయరెడ్డి, కౌన్సిలర్ గట్ల కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాన్షీరాం విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



గురజాల : మాన్యశ్రీ కాన్షీరాం విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో రోడ్డు డివైడర్ వద్ద విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు పేరుపోగు సైదులు మాట్లాడుతూ కాన్షీరాం అందరి వాడని ఒక పార్టీకి సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా ముందుకు వచ్చి విగ్రహం ఏర్పాటుకు చేయూతనందించాలన్నారు. మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. డివైడర్‌లపై మహనీయుల విగ్రహాలు ఏర్పాటుచేయడం ఆనందదాయకమన్నారు. మాలపాటి రత్నాకర్, కె.ఇస్రాయేలు, కె.రామారావు, గుండెబోయిన చిన ఓబయ్య, గంటా వెంకటేశ్వర్లు, నీలం శ్రీను, కె.పవన్ కుమార్, జ్ఞానయ్య, మార్కు, సూరి తదితరులున్నారు.

మళ్లీ సీఎంగా జగనే కావాలని ప్రజల ఆకాంక్ష



నారాయణపురం 20వ వార్డులో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి ముశ్యం వెంకటేశ్వర్లు, నేతలు వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలు సజావుగా అమలు కావాలంటే ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ సీఎంగా జగనే ఉండాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వేముల శ్రీహరి, ఉప్పల రామాంజనేయులు, ముశ్యం ఎర్రబ్బాయి, ముశ్యం శ్రీనివాసరావు, చిన్నం రాము, కొతవరపు ఏడుకొండలు, ముశ్యం అప్పయ్య, ముశ్యం సాంబశివరావు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తుల మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యపై అవగాహన కలిగి ఉండాలి

మాచర్ల: పట్టణంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మునగాల చిరంజీవి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పూర్తి స్థాయిలో విద్య, లక్ష్యసాధన, సమయపాలన, స్టడీ స్కిల్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ మెళకువలను పాటించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఒరుగంటి చెన్నకేశవరావు, కార్యదర్శి పందిరి నరసింహారావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్ కుమార్, సభ్యులు చుండూరు సత్యనారాయణ, హెచ్ఎంలు షకీనా, రామారావు తదితరులున్నారు.

అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్

రెంటచింతల: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్ అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మంచికల్లు, పశర్లపాడు, మిట్టగుడిపాడు గ్రామాలకు చెందిన రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ గ్రామాలలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. నేరాలకు దూరంగా ఉండాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. మీరు ఇష్టం వచ్చినట్లు గ్రామాలలో ప్రజలను ఇబ్బంది పెడితే పోలీసులు చూస్తూ ఉండరని మీ ప్రవర్తన మార్చుకుని జీవించాలన్నారు. మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాలకు సంబంధించి మొత్తం 85 మంది రౌడీషీటర్ల మీద తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ఎవరూ అతీతులు కారని గ్రామాలలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

పవర్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

మాచర్ల: పేద వృద్ధులు, వికలాంగులు, నిరాశ్రయులకు తమ వంతు సహాయ సహకారాలందించేందుకు ఎప్పుడూ ముందుంటామని పవర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు, లాయర్ జి.జయానందరావు అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌వీజేపీపీఎస్ జాతీయ అధ్యక్షులు గురజాల అప్పారావు చేతుల మీదుగా ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రూ.10వేల విలువైన దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సమాజంలో పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జయానందరావు మాట్లాడుతూ ఫౌండేషన్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు వందలాది మందికి తమ వంతు సహాయ సహకారాలందించామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వై.సాంబశివరావు, ఆర్.రంగానాయక్, పేరం రత్నారావు, పోతురాజు పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు జననం నాటిక ప్రదర్శన

కారెంపూడి: స్థానిక లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. రెవరెండ్ పాస్టర్ వి.మాణిక్యారావు క్రీస్తు సందేశం ఇచ్చారు. విశ్వాసులు వందలాదిగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముందుగా క్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. బుద్ధి గల కన్యలు, బుద్ధిలేని కన్యలు నాటిక ప్రదర్శన జరిగింది. చిన్నారుల నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. సతీష్ ఆలపించిన తూర్పు దేశపు జ్ఞానులం గీతాలాపన ఆకట్టుకుంది. క్రిస్మస్ స్టార్స్ ఏర్పాటు చేసి చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కారెంపూడిలో పలు చర్చిలలో క్రిస్మస్ స్టార్స్ ఏర్పాటు చేశారు. సెమీ క్రిస్మస్ జరుపుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి

సత్తెనపల్లి: మండలంలోని అబ్బూరు గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి వారి వార్షిక త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, తీర్థంబిందె తెచ్చుట, విశేష ప్రాతఃకాలర్చనం, మామిడి తోరణాలు కట్టుట, పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తెలను చేయుట, మూలమూర్తికి సర్వాంగ రజిత కవచధారణ, విశేష పూజ, తులసి పూజ నిర్వహించారు. అలాగే సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అఖండ స్థాపనం, మృత్సగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, హోమ కార్యక్రమం, భేరీ పూజ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, సంతానము లేని వారికి గరుడ ప్రసాద వితరణ చేపట్టారు. మొత్తం మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.